


తూర్పు పడమరలుగా సాగుతున్న రోడ్డు మధ్యలో కాలనీ గేటు దగ్గర నిలబడి వున్నాడు బాలయ్య.

టౌను కెళ్ళడానికి బస్సులేవీ వస్తున్న జాడలేదు.

"బస్సుకింకా టైముంది కాబోలు" అనుకుంటూ చేతిలో పేపర్ తెరిచాడు.

"ప్రవాస భారతీయులకు పెద్ద ఎత్తున రాయితీలు" ముఖ్యమంత్రి.

"ఎస్.ఆర్.ఐ. పెట్టుబడులకు పూర్తి రక్షణ కల్పిస్తాం" ఆర్థికమంత్రి స్టేట్‌మెంట్.

"స్వదేశాభివృద్ధికి ఎన్నారైలు తమ వంతు కృషిచేయాలి" ప్రతిపక్ష పార్టీ నాయకుడు.

"ఎన్నారైలకు రాయితీలు పెంచాలి" ఇంకో ప్రతిపక్ష పార్టీ నాయకుడి డిమాండు.

పేపరు నిండా రకరకాల స్టేట్‌మెంట్స్...!

అన్ని స్టేట్‌మెంట్స్ సారాంశం మాత్రం ఎన్నారై పెట్టుబడులకు రక్షణే...!

"పర్వాలేదు కనీసం ఈ విషయంలోనైనా అన్ని పార్టీలూ, అందరు నాయకులూ కలిశారు" అనుకున్నాడు బాలయ్య.

"మనవాళ్ళు విదేశాల్లో వున్నప్పుడు ఐకమత్యం వస్తుందేమో?"

"రాజకీయ నాయకులందర్నీ ఎన్నారైలు చేసేస్తే...?" నవ్వుకున్నాడు.

వూరికి దూరంగా పొలాల మధ్య కట్టిన కాలనీ అవడంతో చల్లటి ఉదయపు గాలి వీస్తోంది.

పచ్చటి పైరు తలల్ని స్పృశిస్తూ గాలి వీస్తోంటే ఆకుపచ్చ సముద్రంలో అలల్లా తోచిందతడికి.

బస్సొస్తుందేమోనని రోడ్డుకేసి చూశాడు.

బస్సు కనపడలేదు కానీ 'పులికాట్ నగర్' అన్న బోర్డు కనిపించింది.

వెలిసి పోతున్న నీలం బ్యాగ్రౌండ్ మీద తెల్లటి అక్షరాలు. అక్కడక్కడా కన్పిస్తున్న తుప్పు మచ్చలు.

"ఈ బోర్డు మళ్ళీ రాయిస్తే బాగుణ్ణు..ఆఫీసు వాళ్ళకు చెప్పాలి. ఈసారి మంచి రంగులు ఎన్నుకోమని కూడా చెప్పాలి. పులికాట్ సరస్సులో ప్రతిఫలించే సూర్య కిరణాల తళతళలు, విహరించే పక్షులు. అక్కడక్కడా దూరంగా తేలిపోతుండే తెరచాప పడవలు. ఈ రంగులన్నీ ఈ బోర్డులో కన్పించాలి. ఇంకా..." అతడి ఆలోచనలకు అడ్డుపడుతూ...

"ఏం సార్... ఎక్కడి వరకు...?" స్కూటర్‌ని ఆపి అడిగాడు కృష్ణమూర్తి.

"ఆదివారం కదా... అలా మార్కెట్ కెళ్ళి రొయ్యలు తెచ్చుకుందామని."

"రొయ్యల కోసమైతే మార్కెట్ కెందుకండీ... అలా పులికాట్ వైపెళ్తే ఫ్రెష్ రొయ్యలు దొరుకుతాయి. నేనూ అటే వెళ్తున్నాను. చక్కని రొయ్యలు చవగ్గా ఇప్పిస్తాను రండి..." అంటూ బాలయ్యను మారు మాట్లాడనీకుండా స్కూటర్ వెనకాల ఎక్కించుకున్నాడు.

పులికాట్ సరస్సుని రెండుగా చీలుస్తూ నల్లటి పొడవాటి తార్రోడ్డు. ఆ రోడ్డు మధ్య స్కూటర్‌లో వెళ్తూ అటు ప్రక్క ఇటు ప్రక్క తళతళా మెరుస్తున్న నీళ్ళని చూస్తే మోటారు బోటులో నీళ్ళని చీల్చుకుంటూ వెళ్తున్న అనుభూతి. రోజూచేసే ప్రాణమే అయినా ఆ అనుభూతి ఎప్పుడూ కొత్తగానే స్పందన కలిగిస్తుంది బాలయ్యకు.

నీళ్ళలో మెరిసే మిలమిలలను చూడ్డం అతడికెంతో ఆనందం.

హేమంతకాలపు వర్షాల్లో ఆకాశం నుంచి రాలి పులికాట్ సరస్సు నీటిలో పడే చినుకుల్ని తదేకంగా చూస్తూ ఆనందించడం అతడికెంతో ఇష్టం.

"ఈ వర్షపు చినుకుల మిలమిలలనేకదా ముత్యపు చిప్పలు ముత్యంగా మార్చేది" అనుకునేవాడు.

# నీవు – నేను

దేవదేవుడు నాటిన దివ్యకుసుమ
వనములోనికి నన్ను రావలదటంచు
మోసమొనరించి పెనుగిరి గీసినావు
గట్టిగా బైట కావలి పెట్టినావు
*

ఆ వనము నుండి వీతెంచు అనిలమైన
పరిమళంబైన నామేన పర్వినంత
మైలపడునని తలచి అంబరము మోవ
గోడ కట్టించి ననువెళ్లగొట్టినావు.
*

ఆ కులలములు చేర్చి గ్రామాంతమందు
కుదురుగా నేను కట్టిన గుడిసె గూడ
పరిజనుల బంపి విధ్వంసపరచినావు
నీడ యెరుగని యెండలో నిలిపినావు
*


నోరు బంధించినావు మనోబలంబు
ఊచముట్టుగ నెప్డో దోచినావు
కరపదంబులు సంకెళ్ల గట్టినావు
సృష్టిలోపల ఏకాకి జేసినావు.
*

రాతిలో కప్పపై వనరాజి మనలు
మృగముపై మింట చరియించు ఖగముపైని
సమముగా ప్రాలు ఈశ్వరేక్షణమునన్ను
చేరకుండగ నీవె శాసించినావు.
*

నీవె న్యాయాధిపతి వౌచు నిన్ననాదు
మౌళితలమున లేని నేరాలు మోపి
మరణశిక్షను విధియించి మురిసినావు
పుణ్యదేవత కన్నులు పొడిచినావు.
*

మందమారుతవీచులు మత్తమధుర
కోకిలా లాపములు లతా కుసుమచయము
దశ దిశావ్యాప్త తరుణచైత్ర ప్రభూతి
నీవె దక్కించు కొన్నావు నేటివరకు.
*

వచ్చె దీపావళీ పర్వవాసరములు
వీథి వీథుల వెలుగులు వెల్లివిరిసె,
ఓయి నరకాసురా! భవద్ వ్యూహరచన
భయదతా మిసములతోడ భస్మమౌత!



– శనగన నరసింహస్వామి

పులికాట్ సరస్సుని చూస్తే ఆ వర్షపు చినుకులన్నీ ఆకాశం నుంచి ప్రయాణంచేసి అలసిపోయి నేలమీద హాయిగా శయనించి సేద తీర్చుకుంటున్నట్టుగా అన్పిస్తుందతడికి.

ముత్యాలు పొదిగిన రత్నకంబళి నిలువుగా వుంటే వర్షం!

నేలమీద పరిస్తే పులికాట్ సరస్సు...!

ఒక అందమైన స్వప్నమందిరంలా కన్పిస్తుంది అతనికి పులికాట్ సరస్సు.

నిజానికి బాలయ్యను పులికాట్ సరస్సు మొదటిచూపులోనే ఎంతో ఆకర్షించింది.

మొదటిసారిగా ఈ రోడ్డుమీద ప్రయాణించిన అనుభవం మధురమైన శాశ్వతానుభూతి అతనికి.

ఆ రోజు...

ఇంటర్వ్యూకోసం...

మొదటిసారిగా ప్రయాణం చేస్తున్నప్పుడు అదృష్టం కొద్దీ కిటికీ ప్రక్కన సీటు దొరికింది. కానీ రోడ్డు మాత్రం కిటికీ లోంచి కన్పించడం లేదు.

పులికాట్ సరస్సులోని నీళ్ళవంకా నీళ్లలో అక్కడక్కడా గుంపులు గుంపులుగా వాలివున్న రకరకాల పక్షులవంకా ఎంతో వివశత్వంతో చూడసాగాడు.

తాను ప్రయాణిస్తున్నది బస్సులోనా లాంచీలోనా అన్న అనుమానంతో బస్సంతా ఓ సారి కలియజూశాడు.

బస్సే నీళ్ళని తోసుకుని దారి చేసుకుంటూ వెళ్తున్న అనుభూతి.

నీలవు ఆకాశాన్ని ప్రతిబింబిస్తోన్న పులికాట్ సరస్సు నీళ్ళలో కదలకుండా నిశ్చలంగా వున్న వేలకొద్దీ వలస విహంగాల్ని చూస్తుంటే నీలవు తివాచీ మీద తెల్లటి పూలడిజైనులా అన్పిస్తుంది.

ఆ విహంగాలు అటూ ఇటూ కదిలినప్పుడు కెలైడో స్కోప్‌లో డిజైన్లు మారినట్లన్పిస్తోంది. ఒక్కసారిగా ఆ పక్షులన్నీ ఎగిరాయి.

ఎగిరినప్పుడు వాటి రెక్కల క్రింద వూరే రంగుల్ని చూసే సరికి ఎంతో ఆనందం వేసిందతడికి.

ఆ రోజు మొదలుగా ఉద్యోగరీత్యా సూళ్ళూరుపేట నుండి శ్రీహరికోటకు ప్రతిరోజూ పులికాట్ సరస్సులోని రోడ్డు మీద ప్రయాణించడం, ఆ ప్రయాణంలో పులికాట్ అందాల్ని తనవితీరా దర్శించడం.

సజీవమైన సౌందర్యం కదలాడే పులికాట్ సరస్సు పదిహేనేళ్ళుగా అతనిలో ఒక మధురమైన భావనగా పెరుగుతూ వచ్చింది.

అతని మనస్సు అనే కాన్వాసు మీద అనుక్షణం అందంగా మారిపోయే అద్భుతమైన చలన చిత్రం ఆ దృశ్యం.

వేగంగా వెళ్తున్న స్కూటర్‌ని వున్నట్టుండి ఆపమన్నాడు బాలయ్య.

"ఏమైంది...?" కంగారుగా అడిగాడు కృష్ణమూర్తి స్కూటర్‌ని ఆపుతూ.

"అటు చూడండి... నీళ్ళలో సుశిక్షితులైన సైనికుల్లా బారులుతీరి నిలబడివున్న గూడ బాతులు, గుంపులు గుంపులుగా నిలబడివున్న ఆ పెలికాన్ పక్షుల సముదాయం, వినీలాకాశంలో మిలమిల మెరిసే నక్షత్రాల్లా చెల్లాచెదురుగా వున్న వుల్లంకి పిట్టలు, ఈ పక్షులన్నీ ఎంతో స్వేచ్ఛగా విహరిస్తుంటే చూడ్డానికెంత ఆనందంగా వుందో..." అని వాటివైపే తదేకంగా చూస్తూ –

"కనుచూపు మేర కనిపించని అంచుతో నీలిరంగులో ఎంతో నిర్మలంగా వున్న నీరు, ఆ నీటిలో క్రమబద్ధంగా బారులుతీరి నిలబడివున్న గూడబాతులు, పెయింటెడ్ స్టార్క్స్‌ని చూస్తుంటే వర్షం వెలిశాక నిర్మలాకాశంలో సప్తవర్ణాల మిశ్రమంతో ముగ్ధమనోహరంగా విస్తరించుకున్న ఇంద్రధనుస్సుని తలపించప చేస్తోంది కదూ?... ఎక్కడివో ఈ పక్షులు... కొన్నాళ్ళ తరువాత మళ్ళెక్కడికెళ్తాయో... కొన్ని నెలలపాటు సహజ సుందరమైన ఈ ప్రశాంత సరస్సుకు తమ అందమైన కదలికలతో జీవంపోసి ఆనందాన్ని చిత్రించే పెయింటింగ్‌లా మారుస్తాయి. ప్రకృతి మానవునికిచ్చిన వరదానం ఇది"

# దీప రుతువు

చీకటి గోడల ముంగిట్లో
ఆముదపు మట్టిదీపమైన వాణ్ణి
అమావాస్యల బుల్‌బుల్ తార మీద
ఒక లేమి పాట నన్నింకా తరుముతూనే ఉంది
నేనేనాడైనా మతాబుగా మారానా
చిచ్చుబుడ్డినై రంగురవ్వలు రాల్చానా
నా గుడిసెలు తగలబడుతూ వుంటే
నీరో నవ్వులువిన్నవాణ్ణి
నరకాసురుల మధ్య నాలుకలు కాల్చుకున్న వాణ్ణి
గాఢాంధకారపు చీకటి పేటలోంచి
మిర్మిట్లు గొలిపే గాబ్రియేలు దూత కోసం కలవరించిన వాణ్ణి
ఆకాశం తెరుచుకోనూలేదు
నా కోసం వెలుగు నిచ్చెన విసరనూ లేదు
ఏదీపోత్సవ వేళైనా
నా కళ్లు భూచక్రాలై తిరిగాయా
బంగళాలు కాల్చి వదిలేసిన పటాకుల శకలాల్ని
తెల్లారి రంగురాళ్లలా ఏరుకున్న వాణ్ణి
పట్టుపరికిణీలూ బుల్లి బుల్లి టెర్లిన్ చొక్కాలూ
కాంతి గోళాలై కేరింతలు కొడుతుంటే
చిరుగుల చెడ్డీ వెనక చేతులు కట్టుకొని
మిణుగురు పురుగుల్ని ముద్దాడిన వాణ్ణి
ధనా ధన లక్ష్మీబాంబులు లడీలై పేలుతుంటే
తాబేలునై లోలోన రెప్పల చప్పట్లు కొట్టుకున్నవాణ్ణి
నా హృదయంలో ఉల్కలు రాల్చిన బోసి ఆకాశమైన వాణ్ణి
నన్ను వెక్కిరించే బాణాసంచా దుకాణాల ముందు
ఒక దిగులు పొగనై కన్నీటి మసిని రాల్చుకున్న రాత్రిని
ముసురులో పేలని టపాకాయల్ని పొద్దున పరిగలా ఏరుకొని
అర్ధరాత్రులు జేబులు నింపుకున్న కలల గంధకపు వాసనని
ఒక్క కాణీ కోసం దినమంతా ఏడుపు రాగమై
అమ్మ కొంగుకి అప్ప కొరివి పెట్టిన లోహితుణ్ణి
నాన్న చివరి దాకా కాపాడుకుంటూ వస్తున్న చిల్లర నాణేల్ని
అతి లాఘవంగా చురాయించిన శర్విలకుణ్ణి
ఇప్పుడు నా చిట్టి తల్లుల చుక్కల చేతుల్లో
గుప్పెడు చందమామ ముక్కలు పాలపుంతలై తుళ్లింతలు పడుతున్నా
నవ్వుల దివ్వెలై నా ముందొక దీప ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నా
నేను మాత్రం –
నా లోపలి గుడిసె ముందు తడి కళ్లతో నిలబడి
ఒక దీప రుతువు కోసం ఇంకా నిరీక్షిస్తూనే వున్నాను

– ఎండ్లూరి సుధాకర్

ఎంతో తన్మయత్వంతో పైకే అనేశాడు.

కృష్ణమూర్తి మాత్రం ఏమీ మాట్లాడకుండా మౌనంగా వుండిపోయాడు.

ఒక్కసారిగా ఆ పక్షులన్నీ ఎగిరితే మొదటి రోజు ఆ పులికాట్ సరస్సులో తను చూసిన వర్ణ సంచలనాన్ని మళ్ళీ చూడాలని వుందతనికి.

"ఒక్కసారి ఈ పక్షులన్నీ ఎగిరితే...?" అన్నాడు.

"దానిదేముందండీ గట్టిగా చప్పట్లు కొడితే అవే ఎగిరిపోతాయి" అన్నాడు కృష్ణమూర్తి.

"ఆ... ఆ,.. వద్దండీ" కంగారుగా అని

"మరణ సదృశమైన మానవుల సంపర్కాన్ని మరచి, వేటగాడి తుపాకీ మోతల భయంలేకుండా వుండాలనే ఈ హేమంతంలో ఇంత దూరం ప్రయాణించి ఇప్పుడిప్పుడే విశ్రాంతి తీసుకుంటున్నాయీ పక్షులు. ఆదమరచి హాయిగా విహరించే ఆ పక్షుల్ని అదిలించడం దారుణం" అనుకున్న దాని కంటే కఠినంగానే వచ్చాయా మాటలు.

వెంటనే ఆ ప్రస్తావన మారుస్తూ –

"ఏరీ... రొయ్యలు పట్టేవాళ్ళు ఎక్కడుంటారు. బాగా చవగ్గా ఇస్తారా!" తను చెప్తున్న అనుభూతిని అర్థం చేసుకోలేని కృష్ణమూర్తితో సానునయంగా అన్నాడు.

ఇంతసేపు బాలయ్య తన్మయత్వం అతనికి విచిత్రంగా అన్పించింది. ఇప్పుడు రొయ్యల బేరం తనకు బాగాపరిచితమైన విషయమవడంతో హడావిడిగా –

"రండి... అదో... ఆ బ్రిడ్జి దగ్గరే" అంటూ కొద్ది దూరం వెళ్ళాక స్కూటరాపాడు కృష్ణమూర్తి.

స్కూటర్ స్టాండువేస్తూ "రండి..." అన్నాడు.

చుట్టూ పరికించి చూస్తూ నడిచాడు బాలయ్య.

చీర కొంగులు ఎగకట్టుకుని, తాటాకు బుట్టలకున్న తాడు బొడ్లో దోపుకుని నీళ్ళలో వంగి చేతుల్తో తవుడ్తూ రొయ్యలు పట్టి బుట్టల్లో వేసుకుంటున్నారు కొందరాడాళ్ళు వాళ్ళకు కొద్ది దూరంలో గూడబాతులు, పెలికాన్స్ తమ పొడవాటి ముక్కుల్ని తలల్తోసహా నీళ్ళలో ముంచి రొయ్యల్ని పట్టుకుని తీరుబడిగా తింటున్నాయి.

ఆ పక్షులు అప్పుడప్పుడు రొయ్యల్ని పట్టుకుంటున్న ఆడాళ్ళవంక చూస్తున్నాయి.

ఆడాళ్ళు మాత్రం అటూఇటూ చూడకుండా ఎంతో ఆత్రంగా తమ చేతుల్తో నీళ్ళని తవుడ్తూ రొయ్యల్ని పట్టి బుట్టల్లో వేసుకుంటున్నారు.

కడుపుకోసం ఆహారాన్ని వెతుకులాడుతుండే పక్షులు.

కడుపుకూటికోసం అర్జనకై అవస్థపడే ఆ ఆడాళ్ళు.

ఒకరి ఉనికి మరొకరికి తెలియనంత సన్నిహితంగా కలసిపోయి తమదైనందిన కార్యక్రమంలో వున్నారు.

కొత్తగా అడుగులు నేర్చుకునే పిల్లల్లా మనుషుల నడక అస్తవ్యస్తంగా వుంది. బాగా పరిచితమైన తమ సొంతదైన చోటులో వరుసగా నిలబడి నడుస్తున్న విహంగాల నడక పరిణితి చెందిన బృంద నాట్యంలా, సుశిక్షితులైన సైనిక కవాతులా వుంది. బాలయ్య పక్షుల్నే చూస్తున్నాడని గమనించిన కృష్ణమూర్తి.

"ఈ పక్షులకు కడుపునిండా ఆహారం దొరికితే అంతే చాలనుకుంటాయి. వెళ్ళి పోతాయి. కానీ ఈ మనుషులు అలా అనుకోరు. ఎన్ని రొయ్యలెక్కువ పట్టుకుంటే అంతెక్కువ డబ్బొస్తుందనుకుంటారు" అన్నాడు.

నీళ్ళలో రొయ్యలు పడుతున్న ఆడాళ్ళవంక చూసి –

"ఏయ్... ఇటూ...!" కేకేశాడు కృష్ణమూర్తి.

అతడికేక విన్న ఇద్దరాడాళ్ళు బ్రిడ్జి మీద కొచ్చారు.

నీళ్ళలోంచి గట్టుమీదకు రావడం వల్ల తడిసిన చీరల్లోంచి నీళ్ళుకారి రోడ్డు మీద పడుతున్నాయి.

ఉప్పనీళ్ళలో తడవడంవల్ల ఒళ్ళంతా మంటా, చలీ... అందుకనే వణుకుతున్నారు. తవుద్దూ రొయ్యలు పట్టేటప్పుడు అరచేతులకు వేళ్ళకు అయిన గాయాల్లోంచి కారుతున్న రక్తాన్ని చీరకు తుడుచుకున్నారు.

అంతవరకూ అందమైన పులికాట్ సరస్సునే చూసిన బాలయ్యకు వాళ్ళను చూడగానే ఏదోలా అయ్యింది మనస్సు.

"ఎంత తేడా...? జీవన పోరాటంకోసం ఎక్కడి నుంచో వచ్చినా పక్షులు ఆనందంగా, అందంగా వుంటే.. వున్న చోట్నే జీవన పోరాటంలో క్షతగాత్రులవుతున్న ఈ ఆడవాళ్ళు.

దేశంకాని దేశమైనా నీరు మాత్రం ఆ పక్షులకు ఎప్పుడూ ఒక్కటే.

తాగడానికి పనికిరాని ఈ నీటిలో తిండానికి కూసింత సంపాయించుకోవడం కోసం దేవులాడుతున్న ఈ ఆడవాళ్లు. ఈ నీళ్ళకోసం ఆకాశాలలో అనంతమైన దూరాన్ని దాటుకొని రాగలవు ఆ పక్షులు.

ఎంత కష్టపెట్టినా, తమ కృషికి అసలు సరిపోని ఫలితమిచ్చినా ఈ నీళ్ళ నొదిలి పోలేరు ఈ ఆడవాళ్ళు..."

బాలయ్య ఆలోచనలను భగ్నంచేస్తూ –

"రొయ్యలున్నాయా...?" అడిగాడు కృష్ణమూర్తి.

"వుండాయయ్యా...!"

"ఇస్తారా...?"

"ఇస్తామయ్యా...!"

"ఏదీ... రొయ్యలెన్నున్నాయో చూపీ..."

బొడ్లో దోపుకున్న తాడులాగి తాటాకు బుట్టల మూతి అదిమి వెడల్పుచేసి లోపలున్న రొయ్యల్ని చూపించారు. బుట్టల్లో ఎన్ని రొయ్యలున్నాయో, ఎలా వున్నాయో పరీక్షగా చూశాక.

"ఎంతీమంటారు...?" అడిగ్గాడు కృష్ణమూర్తి.

"చెరిరవై ఇయ్యండయ్యా..." అందొకామె.

"అమ్మో... చెరిరవయ్యా...? ఇద్దరి బుట్టల్లో కలిపి కిలో రొయ్యలు కూడా లేవు. చెరి పదిస్తా... ఇష్టంగుంటే ఇయ్యండి లేదంటే లేదు" ఖచ్చితంగా తనరేటు చెప్పాడు.

వాళ్ళు చెప్పినదానికి సగం రేటుకే కృష్ణమూర్తి బేరం చెయ్యడం బాలయ్యకు చాలా ఆశ్చర్యం కలిగించ సాగింది.

"పోనీ... చెరో పదిహేనీండయ్యా..."

"నీళ్ళలో దొరికే రొయ్యలను కుంటుండారా డబ్బులు... మీ ఇష్టమొచ్చినట్టడుగుతున్నారు. చెరి పదికంటే ఎక్కువీను."

ఆ ఆడాళ్ళను చూడగానే వికలమైన మనస్సు బాలయ్యను మాట్లాడనివ్వ లేదు.

కాసేపు బేరం జరిగాక –

మార్కెట్ రేటు తెలియని ఆ అమాయకులు కృష్ణమూర్తి వంకో రెండు క్షణాలు చూశారు. తరువాత ఏమనుకున్నారో ఏమో... రెండు బుట్టల్లోని




రొయ్యలు తీసుకోమన్నట్టు బుట్టలు అతడి ముందు పెట్టారు.

కృష్ణమూర్తి బాలయ్య వంక చూసి.

"ఈ రొయ్యలు తీసుకుందాం. ఇంటికెళ్ళాక చెరిసగం చేసుకుందాం." అని రెండు బుట్టల్లోని రొయ్యల్ని బాలయ్య ఇచ్చిన న్యూస్ పేపర్లోపోసి పొట్లం కట్టి స్కూటర్ బాక్సులో పెట్టాడు.

ఆడాళ్ళు చెరి పది తీసుకుని మళ్ళీ నీళ్ళలోకి దిగారు.

"ఛ... ఛ... ఏం మనుషులో... ఊరికే నీళ్ళలో పట్టుకునే రొయ్యల్ని కూడా వీళ్ళ ఇష్టమొచ్చిన ధరకమ్ముతుంటారు" విసుక్కుంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడు.

"రొయ్యలు కాస్త పెద్ద సైజువిగా వున్నట్టున్నాయి కదండీ...?" అడిగాడు బాలయ్య.

"నిజమే సార్... కొంచెం పెద్ద సైజే... ఇదే సైజు రొయ్యలు మార్కెట్లో కనుక కొనాలంటే కిలో అరవైరూపాయిలు చెప్తారు."

"ఆ...! అంత తేడా వుందా?" ఆశ్చర్యపోతూ అడిగాడు బాలయ్య.

"మరేమనుకుంటున్నారుసార్... మనం పది రూపాయిలకు తీసుకొన్న రొయ్యలు ఎంత లేదన్నా మార్కెట్లో ముప్ఫయ్ రూపాయిలుంటాయ్. అదీకాక మార్కెట్లో ఫ్రెష్ సరుకెప్పుడూ దొరికి చావదు. అన్నీ ఐసురొయ్యలే..."

"ఆ విషయం ముందే తెలిసివుంటే వాళ్ళతో బేరం చెయ్యకుండా చెరిరవై ఇచ్చేసుంటే బాగుండేది కదా?"

"భలే వాళ్ళు సార్... వాళ్ళేమన్నా రొయ్యల్ని మేతేసి సాకి పట్టి అమ్ముతున్నారా... వాళ్ళడిగిన రేటు ఇవ్వడానికి."

"అది కాదనుకోండి."

"చూడండి... వాళ్ళేం తెలివి తక్కువై మనకారొయ్యలు చెరి పదికివ్వ లేదు. ఇంకొద్ది సేపాగితే రొయ్యలు కొనే దళారీ వస్తాడు. వాడొచ్చాడంటే కిలోకాదు... వీశె పది లెక్కన వీళ్ళదగ్గర కొంటాడు తెలుసా?"

"నిజంగానా?"

"నేచెప్పేది నిజమండీ బాబూ... కావాలంటే మనబైపాసు రోడ్డులో వుండే రొయ్యల దళారీ మునుస్వామి ఇల్లు చూడండి. వాడు నేను శ్రీహరికోటలో చేరినప్పుడు టీ అంగట్లో గ్లాసులూ గట్రా కడిగేవాడు. మెల్లగా రొయ్యల వ్యాపారంలో దిగాడు. అంతే నాలుగేళ్ళకంతా రెండంతస్తుల మిద్దె కట్టాడు. రెండు మూడు లక్షల బ్యాంకు బాలెన్సు కూడా నిలుపుకున్నాడు."

"నిజమే... ఆ మునుస్వామి ఇల్లు నాకూ తెలుసు. మన సూళ్ళూరుపేటలో కెల్లా అందమైన మిద్దె అతడిదే!"

"ఏంటో... ఉప్పనీళ్ళలో చలికీ మంటకీ తట్టుకొని అరచేతుల్లోంచి రక్తం స్రవిస్తున్నా ఎంతో శ్రమిస్తూ రొయ్యలు పట్టే వాళ్ళకు కూటికీ గుడ్డకీ కూడా కరవే! కానీ వాళ్ళ దగ్గర రొయ్యలు కొని మార్కెట్లో అమ్మే దళారీలకు ఏ మాత్రం శ్రమ అవసరం లేదు. కొద్దిపాటి పెట్టుబడి వుంటే చాలు..."

రోడ్డు ప్రక్కనుండి చిన్న పిల్లల ఏడుపులు వినిపించడంతో ఆలోచనల్లోంచి బయటపడి అటువైపుకి చూశాడు బాలయ్య.

నల్లటి ఎండు పుల్లల్ని అర్ధచంద్రా కారంలో వంచి భూమిలోకి పాతి వాటిమీద తాటాకు, ప్లాస్టిక్ గోతాలు కప్పి వున్న తీరు చూస్తుంటే వాటిని 'గుడిసె'నడానికి కూడా మనస్కరించదు. దానిలోపల నిల్చోవడం మాటటుంచినా కూర్చోవడం కూడా జరగని పని. కేవలం రెండు మోకాళ్ళూ పొట్టలో దోపుకుని గొంతు కూర్చోవడానికి సరిపోవచ్చు. పడుకోవాలంటే కూడా రెండు మోకాళ్ళూ పొట్టలోదోపుకుని ముడగదీసుకోవాల్సిందే! ఎండనీ వాననీ సమంగా లోపలకు పంపగల శక్తి మాత్రం ఆపైకప్పకుంది. అటువంటి గుడిసెల్లో ఎలా జీవితాన్ని వెలిబుచ్చుతున్నారో?

మట్టిలో కూర్చుని అల్యూమినం గిన్నెలోని అన్నాన్ని అటూ ఇటూ గెలు

కుతూ ఏడుస్తున్నారిద్దరు పిల్లలు.

"గబాల్న తిని చావండ్రా... మళ్ళా నీళ్ళలో దిగాల... ఎండెక్కిందంటే ఒకటే ఒళ్ళు మంటరా..." బెదిరిస్తూ బ్రతిమాలుతుంది తల్లి.

తైల సంస్కారం లేక ఎర్రబారిపోయిన చింపిరి జుట్టుతో, రోజుల తరబడి స్నానం లేక తెల్లగా అట్టలట్టలుగా ఉప్పు పేలిపోయిన నల్లటి శరీరంతో గోచీ గుడ్డ కాదు కదా కనీసం మొలతాడు కూడా లేకుండా దిగంబరంగా వున్నారా పిల్లలు.

"అటు టిఫిను టైమూ కాదు, ఇటు భోజనం టైమూ కాదు. ఈ వేళప్పుడు తినడమేంటి? నా చిన్నప్పుడైతే ఒక్కపూట ఆటల్లో పడి వేళ తప్పినా అమ్మెంతగా కసురుకునేది... 'వేళ తప్పి తినే తిండి ఒంటికి పడదురా... అందుకని వేళకే తినేయాలి' అనేది. మరి వీళ్ళేంటి...?" తన అనుమానాన్ని కృష్ణమూర్తి ముందుంచితే –

"ఎప్పుడు దొరికితే అప్పుడు తినడమే వీళ్ళ వేళ"

"అంటే...?"

"రొయ్యలు పట్టడం అయ్యాక అన్నం వండుతారు. వండాక పెడ్తారు. పెట్టాక తినాలి."

"అంటే తినడానికి వేళా పాళా వుండదా?"

"ఒక్కోపూట తినడానికి తిండే దొరకదు. మళ్ళీ వేళాపాళా కూడానా?"

వేళకే కాదు ఈ పిల్లలకసలు ఒక్కోపూట అన్నమే దొరకదన్న నిజం తెలుసుకున్న బాలయ్య మెదడు మొద్దుబారిపోయింది.

బస్సులో వెళ్తున్నా స్కూటర్‌లో వెళ్తున్నా ఎప్పుడూ పులికాట్ అందాల్ని మాత్రమే చూసే అతడు మొట్టమొదటి సారిగా ఎంతో కళా విహీనంగా కన్పిస్తున్న గుడిశెల వంకా, ఆ పిల్లల వంకా మరోసారిచూసి తలపక్కకు తిప్పాడు.

"పెలికాన్ పక్షుల భూతలస్వర్గం" అని రాసిన ఓ పెద్ద బోర్డు.

దానివంక చూసి "నిజమే! ఇది పెలికాన్ పక్షుల పాలిట భూతల స్వర్గమే! కానీ ఇక్కడ రొయ్యలు పట్టుకునే వాళ్ల పాలిటకి మాత్రం" అనుకున్నాడు బాలయ్య.

అతనిలో అసహాయత్వం ఎక్కువయ్యింది. మొదటిసారిగా బిచ్చగాడ్ని చూసిన సిద్ధార్థుడిలా అతడి మనసు మొద్దుబారి పోయింది.

ఇంకొంచెం ముందు ఇంకో పెద్ద బోర్డు –

"పులికాట్ పక్షుల రక్షిత స్థలం" 'పక్షులను వేటాడుట, వాటి స్వేచ్ఛా విహారానికి భంగం కల్గించుట నిషిద్ధం' అన్న పెద్ద అక్షరాలు.

విదేశాల్నుంచి వలసొచ్చిన ఈ పక్షులు స్వేచ్ఛగా తిరగడానికి అవకాశం వుంది. తమకి కావలసిన వేళకి ఆహారం తినడానికీ చేతనవును వాటికి. ఇక్కడి సీజన్ పూర్తయ్యాక దారి పూర్తిగా తెలుసుకనుక ఏ దిక్కున ఎగిరెళ్తే వాటి దేశం వస్తుందో ఆ వైపు హాయిగా ఎగిరి వెళ్ళిపోతాయి. మరిక్కడి మనుషులకు? మరోదారిలేదు. మనుగడకు మరో మార్గమూ తెలియదు. వాళ్ళు నిజంగా దిక్కులేని పక్షులు!

బాలయ్య ఆలోచనలకు అడ్డు తగుల్తూ... "సార్! నాకు టౌన్లో పనుంది. మీరు వస్తారా?" అడిగాడు కృష్ణమూర్తి.

"లేదు. ఇంటికెళ్ళిపోతాను" అన్నాడు బాలయ్య.

స్కూటరాపి బాక్సులోని రొయ్యల పొట్లంతీసి రొయ్యలు రెండు సమభాగాలు చేశాక 'రొయ్యలు కట్టుకోడానికి ఆ పేపర్లో నాక్కొంచెం ఇవ్వండి" అడిగాడు కృష్ణమూర్తి.

ఆ పేపర్ని మధ్యకు చించుతుంటే "ఎన్‌ఆర్‌ఐ పెట్టుబడులకు రక్షణ" అన్న హెడ్డింగ్ కన్పించింది.

"నిజమే! ఎన్నారైలుపెట్టే విదేశీ పెట్టుబడులకు రక్షణ వుంటుంది. విదేశాల నుంచి వచ్చినవలస పక్షులకూ రక్షణ వుంటుంది. వాటికి రక్షిత స్థలాలూ వుంటాయి... కానీ ఇక్కడి మనుషులకే ఏమీ వుండదు" అనుకున్నాడు బాలయ్య. ★


దీపావళి శుభాకాంక్షలతో

Overall Rating 3 awarded by MDRA under mandatory rating requirements

భారత ప్రభుత్వము వారి అనుమతి పొంది, సొంత ఎల్.పి.జి. బాట్లింగు ప్లాంటు కలిగి, రెండు దశాబ్దములుగా గ్యాస్ వ్యాపారములో అనుభవము గల వారిచే స్థాపించబడి విజయవంతంగా నడపబడుచున్న వెంకటేశ్వరా పెట్రో కెమికల్స్ ప్రై. లిమిటెడ్ వారు అందిస్తున్న గ్యాస్




మీరు పిలిస్తే పలికే గ్యాస్

కాల్ గ్యాస్

వెంకటేశ్వర పెట్రో కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్

రిజిష్టర్డ్ ఆఫీస్ :
వెంకటేశ్వర కాంప్లెక్స్
జి.ఎన్.టి. రోడ్, గన్నవరం - 521 101
ఫోన్స్ : 573207, 573206

ఎల్.పి.జి. డివిజన్

ఎల్.పి.జి. బాట్లింగ్ ప్లాంట్
చిన అవుటపల్లి - 521 286
గన్నవరం మండలం, కృష్ణాజిల్లా
ఆంధ్ర ప్రదేశ్, ఫోన్ : 573205

CALL GAS CALL GAS